సాక్షి
ఖమ్మం
మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



కాల్వొడ్డు మున్నేటి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మలతో వస్తున్న యువతి



బతుకమ్మతో చిన్నారి



బీరప్ప దేవాలయంలో..

పుష్ప విలాసం !

ఊరూరా సద్దుల బతుకమ్మ ● ఉత్సాహంగా ఆడిపాడిన మహిళలు



పూజ చేస్తున్న సీపీ సునీల్‌దత్ దంపతులు



మున్నేటిలో బతుకమ్మను నిమజ్జనం చేస్తూ..



బతుకమ్మల వద్ద కలెక్టర్ అనుదీప్ దంపతులు

పితృ అమావాస్య రోజున ఎంగిలిపూలుగా మొదలైన బతుకమ్మ వేడుకలు సోమవారం ముగిశాయి. సద్దుల బతుకమ్మపై సందిగ్ధత ఏర్పడినా జిల్లా మహిళలు తొమ్మిది రోజునే సద్దుల బతుకమ్మ నిర్వహించుకున్నారు. ఉదయమే వివిధ రకాల రంగురంగుల పూలు సేకరించి అందంగా పేర్చారు. సాయంత్రం పట్టువస్త్రాలు ధరించిన మహిళలు, చిన్నారులు సమీపంలోని ఆలయాలు, జలాశయాల వద్దకు చేరుకుని ఒకచోట బతుకమ్మలు ఉంచి ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం వాయినాలు ఇచ్చుకోవడంతో పాటు తమ వెంట తీసుకొచ్చిన ప్రసాదం అందరికీ అందజేశారు. ఆతర్వాత 'వెళ్లి రావమ్మా.. మళ్లీ రావమ్మా..' అంటూ జలాశయాల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

సరస్వతీదేవిగా అమ్మవారు



ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా స్వామికి అర్చకులు తెల్లవారు జామున పంచామృతంతో అభిషేకం చేశారు. ఆతర్వాత యాగశాలలో అమ్మవారిని సరస్వతీదేవి రూపంలో అలంకరించి చండీహోమం నిర్వహించడమే కాక పలువురి చిన్నారులకు అక్షరాభ్యాసం జరిపించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

భద్రాచలంటౌన్: ఆర్టీసీలో వేయి మంది డ్రైవర్లు, 743 శ్రామిక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిందని, ఉమ్మడి జిల్లాలో అర్హత కలిగిన గిరిజన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని భద్రాద్రి ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. www. tgprb. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 22 – 40 ఏళ్ల వయస్సు కలిగిన వారు డ్రైవర్లుగా, 18 – 35 ఏళ్ల వయస్సు వారు శ్రామిక్ పోస్టులకు అర్హులని వెల్లడించారు. డ్రైవర్ పోస్టుకు రూ.300, శ్రామిక్ పోస్టుకు రూ.200 చెల్లించి అక్టోబర్ 8నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని పీఓ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నాలుగో రోజూ అందని టెండర్లు

పండుగ తర్వాతే వైన్స్ దరఖాస్తులు



వివరాలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ఖమ్మంక్రైం: 2025–2027 సంవత్సరంనకు గాను జిల్లాలో 116 వైన్స్ షాపుల కేటాయింపునకు షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు ఈనెల 26వ తేదీ నుంచి టెండర్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. అయితే, నాలుగో రోజైన సోమవారం కూడా జిల్లాని షాప్‌లకు ఒక్క దరఖాస్తు రాలేదు. జిల్లావ్యాప్తంగా వైన్స్‌కు ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1లోనే దరఖాస్తుల స్వీకరించనున్నట్లు ప్రకటించారు. కాగా, వ్యాపారులు పలువురు మంచి రోజు చూసుకుని డీడీలు తీస్తున్నా అక్టోబర్ 18వరకు గడువు ఉన్నందున దసరా తర్వాతే టెండర్లు దాఖలు చేయాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఆలోగా ఒకటి, రెండు దరఖాస్తుల వచ్చినా పండుగ తర్వాత ఊపందుకుంటుందని భావిస్తున్నారు.

సమరానికి సైరన్





ఉత్కంఠకు తెర

స్థానిక సంస్థల ఎన్నికలపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. ఏడాదిన్నరగా అటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఇటు గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై అయోమయం నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలుకు ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించింది. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించాలని కొందరు కోర్టుకు వెళ్లడంతో.. సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు తీర్పునిచ్చింది. ఆమేరకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసినా.. రిజర్వేషన్లు తేలకపోవడంతో కొంత ఆలస్యమైంది. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్లు ఖరారు కావడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది.

రెండు విడతల్లో పరిషత్ పోరు

- వచ్చే నెల 23, 27వ తేదీల్లో పోలింగ్
- మూడు విడతల్లో గ్రామపంచాయతీల ఎన్నికలు
- వచ్చే నెల 31, నవంబర్ 4, 8 తేదీల్లో పోలింగ్‌కు షెడ్యూల్ విడుదల
- ఏర్పాట్లలో నిమగ్నమైన జిల్లా యంత్రాంగం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి ఎన్నికల సంఘం సైరన్ మోగించింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతో పాటు గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో రాజకీయ పార్టీల నాయకులు, ఆశావహుల నిరీక్షణకు తెరపడింది. వచ్చేనెల 9వ తేదీన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా.. తొలుత రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, ఆపై మూడు విడతల్లో జీపీ ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ విడుదలతో కోడ్ అమల్లోకి రాగా, ఎన్నికల సందడి మొదలైంది.

అంతా సిద్ధం..

ఎన్నికల ఏర్పాట్లపై యంత్రాంగం దృష్టి సారించింది. ఇప్పటికే పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల జాబితా ఖరారు కాగా.. బ్యాలెట్‌బాక్స్‌లు, ఇతర సామగ్రి సమకూర్చుకున్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు 1,580 పోలింగ్ కేంద్రాలను గుర్తించి 2,814 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. గ్రామపంచాయతీలకు 20 శాతం రిజర్వ్‌తో కలిసి 6,257 బ్యాలెట్ బాక్స్‌లు అవసరం ఉండగా.. ప్రస్తుతం 3,146 బ్యాలెట్ బాక్స్‌లు అందుబాటులో ఉన్నాయి. కాగా, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పీఓలు 1,895, ఓపీఓలు 5,055 అవసరమని గుర్తించారు. జిల్లాలో క్రిటికల్ పోలింగ్‌స్టేషన్లు 18, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 138, అతి సమస్యాత్మక కేంద్రాలు 200గా గుర్తించి అక్కడ ప్రత్యేక దృష్టి సారించారు.

వచ్చేనెల 9న పరిషత్ నోటిఫికేషన్

జిల్లాలో రెండు విడతల్లో మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత అక్టోబర్ 9న, రెండో విడత 12న నోటిఫికేషన్ విడుదలవుతుంది. మొదటి విడత అక్టోబర్ 11 వరకు, రెండో విడత 15 వరకు నామినేషన్లు స్వీకరించి, అక్టోబర్ 23, 27వ తేదీల్లో పోలింగ్ నిర్వహిస్తారు. మొత్తం కలిపి నవంబర్ 11న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఆ తర్వాత పంచాయతీ

జిల్లాలో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు ఉంటాయి. అక్టోబర్ 17, 21, 25వ తేదీల్లో విడతల వారీగా నోటిఫికేషన్లు విడుదల చేస్తారు. ఇక 19, 23, 27వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చు. గ్రామపంచాయతీ పోలింగ్ మొదటి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత 8న నిర్వమిస్తారు. ఏ విడతలోనైనా ఎన్నిక ముగిసిన రోజే ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఆ రోజే ఉప సర్పంచ్ ఎన్నిక కూడా నిర్వహించాలి. ఏదైనా కారణంతో ఉపసర్పంచ్ ఎన్నిక జరగపోతే మరుసటి రోజు ఎన్నుకుంటారు.

'పరిషత్' గణాంకాలు

జెడ్పీటీసీ స్థానాలు	20
ఎంపీటీసీ స్థానాలు	283
పోలింగ్‌స్టేషన్లు	1,580
ఓటర్లు	8,02,690
పురుషులు	3,88,243
మహిళలు	4,14,425
ఇతరులు	22

'గ్రామపంచాయతీ'లు ఇలా..

గ్రామపంచాయతీలు	571
వార్డులు	5,214
పోలింగ్ స్టేషన్లు	5,214
ఓటర్లు	8,02,691
పురుషులు	3,88,244
మహిళలు	4,14,425
ఇతరులు	22

ఎక్కడెక్కడ...
ఏ విడతలో అంటే.. 8లో

పక్కాగా నిబంధనల అమలు

- ఎన్నికల నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఎక్కడ కూడా నియమావళి, నిబంధనలను విస్మరించకుండా యంత్రాంగం పర్యవేక్షించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలు, ఇతర ఏర్పాట్లపై సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ప్రవర్తన నియమావళిని అమలు చేయాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఎవరు వ్యవహరించినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్‌కు బ్యాలెట్ బాక్సులు సమకూర్చుకోగా, ఉద్యోగులకు శిక్షణపై ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై అధికారులతో కలెక్టర్ అనుదీప్ సమీక్షించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. నిబంధనలు పక్కాగా అమలయ్యే అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు తొలగించడమే కాకప్రతీ మండలంలో అవసరమైన బృందాలను ఏర్పాటుచేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి వసతులపై నివేదిక ఇవ్వాలని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక నామినేషన్ల స్వీకరణ, ఉప సంహరణ, స్క్రూటినీ, గుర్తుల కేటాయింపులో పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల శిక్షణకు ఉద్యోగులు హాజరుకాకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు కార్యాచరణ, సీఎంఆర్ సేకరణ, పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, ఆన్‌లైన్‌లో పంటల నమోదుపై సూచనలు చేశారు. ఈ సమావేశాల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ కమిటీలతో జీవనోపాధి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 234 మంది సభ్యులకు యూనిట్ల పంపిణీ

మధిర: అటవీ సంరక్షణ కమిటీలు అటవీ సంరక్షణలో మాత్రమే కాకుండా గ్రామీణ కుటుంబాలకు జీవనోపాధి అవకాశాలు కల్పించడంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మధిర అటవీ రేంజ్ పరిధి గుంటుపల్లి, గోపవరం గ్రామ వన సర్కాకశస్ సమితి సభ్యుల జీవనోపాధి, సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం యూనిట్లను సోమవారం మధిరలో డిప్యూటీ సీఎం భట్టి పంపిణీ చేసి మాట్లాడారు. ప్రకృతి పరిరక్షణతో పాటు సమాజ సమగ్రాభివృద్ధికి అటవీ సంరక్షణ కమిటీలు కృషి చేస్తున్నాయని తెలిపారు. జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ మాట్లాడుతూ అటవీ సంరక్షణ కమిటీల అభివృద్ధికి అన్నిరకాల చేయూతనిస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువత, మహిళలకు అందించే యూనిట్లతో వారి ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని తెలిపారు. ఈమేరకు 234 మంది సభ్యులకు 115 పవర్ టిల్లర్లు, 10రోటోవేటర్లు, 11ట్రాక్టర్ కల్టివేటర్లు పంపిణీ చేశామని వెల్లడించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బండారు నరసింహారావు, మధిర రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ బి.శ్రీనివాసరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.



యంత్రాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

చింతకాని: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అత్యధిక స్థానాల్లో గెలిచేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సూచించారు. హైదరాబాద్ వెళ్లే క్రమాన చింతకాని మండలం నాగులవంచలో మత్కేపల్లి మార్కెట్ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు ఇంటి వద్ద ఆయన ముఖ్యనాయకులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు, పోటీపై సూచనలు చేశారు. అలాగే, రైతుల అభ్యున్నతికి పాటుపడాలని మార్కెట్‌కు చైర్మన్‌కు సూచించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మడుపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, కన్నెబోయిన గోపి, బండెల నాగార్జున్, ఆలస్యం బస్వయ్య, కంభం వీరభద్రం, షేక్ అబ్దుల్ నబీ, తదితరులు పాల్గొన్నారు.

మా హయాంలోనే అభివృద్ధి



మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మంత్రి పొంగులేటి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి పరుగులు తీస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండలంలోని అమ్మగూడెం, కోనాయిగూడెం, నేలకొండపల్లిల్లో సోమవారం ఉదయం ఆయన బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అలాగే, ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బొందయ్య, అడపాల రామారావు, నల్లాని మల్లికార్జున్‌రావు, రాయపూడి నవీన్, నంబూరి రామారావు, యర్రబోయిన నర్సయ్య, పెంటమళ్ల పుల్లమ్మ, కొచ్చేర్ల శ్రీనివాసరావు, కొమ్మినేని పుష్పావతి, మేకల వెంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్‌బాబు, కడియాల నరేష్, ఇస్లావత్ బాలాజీ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ వేడుకల్లో మంత్రి

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాత్రి నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో ఆడిపాడిన ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తోందని మంత్రి తెలిపారు.

మళ్లీ పెరిగిన గోదావరి

కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

భద్రాచలంటౌన్ : భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం మళ్లీ పెరిగింది. సోమవారం రాత్రి 10 గంటలకు 46.70 అడుగులకు చేరింది. శనివారం రాత్రి 43అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అయితే ఆదివారం రాత్రి 42.70 అడుగులకు చేరడంతో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. సోమవారం ఉదయం నుంచి మళ్లీ పెరగడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటిమట్టం 46 అడుగులకు పైగా నమోదు కావడంతో భద్రాచలం నుంచి చర్లతో పాటు ఏపీలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పరీవాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.



భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

నీట మునిగిన తూరుబాక రోడ్డు

దుమ్ముగూడెం : గోదావరి ప్రవాహం పెరగడంతో మండలంలోని తూరుబాక వద్ద డైవర్షన్ రోడ్డుపైకి వరద చేరింది. దీంతో రాకపోకలు నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వస్తుండడంతో పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి, దుమ్ముగూడెం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పర్ణశాల నారచీరల ప్రాంతం నీట మునిగింది.

క్లుప్తంగా

ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికైన కానిస్టేబుల్


కారుమంచి విజయ్

వైరారూరల్: వైరా మండలం గన్నవరం గ్రామానికి చెందిన కారుమంచి విజయ్ గ్రూప్–2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. ఆయన బీటెక్ పూర్తిచేశాక 2012లో రైల్వే ట్రాక్‌మెన్‌గా, 2014లో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి సత్తుపల్లిలో ఉద్యోగం చేస్తున్నాడు. అయినా పట్టువీడక పరీక్షలకు సిద్ధమవడంతో గ్రూప్–2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. విజయ్ తల్లిదండ్రులు కారుమంచి జయరావు, ఎలిశమ్మ వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తూ చదివించారు.

5న సీపీఐ శత వసంతాల సభ సన్నాహక సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐశత వసంతాల ముగింపు సభ డిసెంబర్‌లో ఖమ్మంలో జరగనుండగా, నేపథ్యాన అక్టోబర్ 5న సన్నాహక సమావేశం ఏర్పాటుచేసినట్లు భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు ఎస్.కే.సాబీర్ పాషా, దండి సురేష్ తెలిపారు. ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, బినాయ్ విశ్వం, కె.నారాయణ, అజీజ్ పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకటరెడ్డి హాజరవుతారని వెల్లడించారు. అలాగే, ఆహ్వాన సంఘ సమావేశానికి తెలంగాణతో పాటు వివిధ ఇతర రాష్ట్రాల నేతలు పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ, ఎం.వీరపాండ్యన్, మహ్మద్ సలీం, సుందరేష్, పర్ష పద్మ, శ్రీనివాస్, ఈటి నర్సింహా, బాగం హేమంతరావు తదితరులు కూడా పాల్గొంటారని తెలిపారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి


ధర్నాలో పాల్గొన్న డీలర్లు, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

ఖమ్మం సహకారనగర్: రేషన్ డీలర్ల పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించాలని సంఘం బాధ్యులు కోరారు. కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు మాట్లాడుతూ తమకు నెలలుగా పెండింగ్ ఉన్న కమీషన్ విడుదల చేయడమే ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ధర్నాకు వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి సంఘీభావం తెలిపి మాట్లాడుతూ డీలర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా నిలుస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. డీలర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బానోతు వెంకన్న, షేక్ జానీమియాతో పాటు దుర్గయ్య, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	5,400	3,000
ఏసీ మిర్చి	15,150	8,000
మిర్చి	8,100	5,000
కొత్త పత్తి	7,500	4,300

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,107

విద్యుత్ శాఖకు బకాయిల షాక్

- జిల్లాలో బకాయిలు రూ.143కోట్లకు పైగానే..
- వసూళ్ల బాధ్యత సిబ్బందికి అప్పగింత..
- వినియోగదారుల్లో అవగాహనకు మైకులతో ప్రచారం



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో విద్యుత్ బిల్లు బకాయిలు నానాటికీ పెరుగుతున్నాయి. వివిధ కేటగిరీల్లో విద్యుత్ వినియోగానికి సంబంధించి బకాయిలు రూ.కోట్లలోకి చేరడంతో వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో ఎనిమిది కేటగిరీల్లో సుమారు 7 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో దాదాపు 5లక్షలు గృహ సర్వీసులు, 1.20 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. అలాగే, పరిశ్రమలవి 66 లక్షలు, ఇతరత్రా మరో 13 లక్షల వరకు ఉన్నాయి. అయితే, 5లక్షల గృహ సర్వీసుల్లో 2.88 లక్షల సర్వీసులు గృహజ్యోతి పథకంలో కొనసాగుతుండగా, మరికొందరు తెల్ల రేషన్ కార్డుదారులు సైతం గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా తమకు ఉచిత విద్యుత్ అందుతుందనే భావనతో నెలనెలా బిల్లులు చెల్లించడం లేదు. మిగిలిన కేటగిరీల్లో బకాయిలు పేరుకుపోవడంతో అధికారులు వసూళ్ల బాధ్యతను ఉద్యోగులు, సిబ్బందికి అప్పగించి మైకుల్లో ప్రచారం చేస్తున్నారు.

ప్రభుత్వ శాఖలవే అధికం

జిల్లాలో 2025 జూలై 31నాటికి విద్యుత్ బకాయిలు రూ.143.32 కోట్ల మేర పెండింగ్ ఉన్నాయి. ఆతర్వాత ఆగస్టు వరకు లెక్కిస్తే ఈ బకాయి మరింత పెరిగే అవకాశముంది. ఇందులో అధికంగా ప్రభుత్వ శాఖలవే ఉండడం గమనార్హం. గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీల్లో వీధిలైట్లు, వాటర్ వర్క్స్ అంశాల్లో రూ.83.21 కోట్ల బకాయి ఉండగా.. కేటగిరీ–2లో గృహేతర, వాణిజ్య సర్వీసుల బకాయిలు రూ.30.39 కోట్లు పేరుకుపోయాయి. ఇక గృహాలకు సంబంధించి రూ.13.65 కోట్లు, వ్యవసాయ కనెక్షన్ల బకాయి రూ.11.66 కోట్లు ఉండడంతో వసూళ్లపై విద్యుత్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది.

సెక్షన్ల వారీగా బాధ్యతలు

బకాయిల వసూళ్లకు విద్యుత్ శాఖ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా విద్యుత్ సిబ్బందికి బాధ్యతలు అప్పగించింది. బకాయి జాబితాలను సెక్షన్ల వారీగా అందించి వినియోగదారుల వద్దకు వెళ్లి బిల్లు చెల్లించేలా అవగాహన కల్పించాలని సూచించారు. దీంతో లైన్‌మెన్లు మొదలు ఆపై ఉద్యోగులు బకాయి జాబితాలతో వినియోగదారులు కలుస్తున్నారు. బకాయి పేరుకుపోతే ప్రతీనెల 6 శాతం వడ్డీ పడుతుందని, తద్వారా బిల్లు పెరుగుతుందని చెబుతూ చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాక గృహజ్యోతిపైనా వినియోగదారుల్లో సందేహాలను నివృత్తి చేస్తున్నారు. దీనికి తోడు పలు ప్రాంతాల్లో బిల్లు బకాయి చెల్లించాలని సిబ్బంది మైకుల్లో ప్రచారం చేస్తున్నారు.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు...



విద్యుత్ బిల్లు బకాయిలు వసూలు చేసేలా ప్రత్యేక దృష్టి సారించాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. విద్యుత్ సరఫరాతో పాటు బిల్లుల వసూలు బాధ్యత మా శాఖపై ఉంది.. వివిధ కేటగిరీల్లో పేరుకుపోయిన బకాయిలను వసూలు చేసేలా సిబ్బంది కృషి చేస్తున్నారు.

– ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఎస్ఈ, ఎన్పీడీసీఎల్

కేటగిరీల వారీగా విద్యుత్ బకాయిలు (రూ. కోట్లలో)

కేటగిరీ	బకాయి
కేటగిరీ–1 (గృహాలు)	13.65
కేటగిరీ–2 (వాణిజ్య/గృహేతర)	30.39
కేటగిరీ–3 (ఎల్‌టీ ఇండస్ట్రీ)	3.18
కేటగిరీ–4 (కాటేజెస్ ఇండస్ట్రీస్)	0.01
కేటగిరీ–5 (వ్యవసాయ)	11.66
కేటగిరీ–6 (జీపీలు, మున్సిపాలిటీలు)	83.21
కేటగిరీ–7 (పాఠశాలలు, ఆలయాలు)	0.97
కేటగిరీ–8 (తాత్కాలిక సరఫరా)	0.25
మొత్తం	143.32

రెండు విడతల్లో పరిషత్.. మూడు విడతల్లో జీపీ

జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. ఒక్కో విడతలో పదేసి మండలాల ఎన్నికలు నిర్వహిస్తారు. మొత్తం 283 ఎంపీటీసీ స్థానాలకు గాను మొదటి విడతలో కామేపల్లి, బోనకల్, చింతకాని, మధిర, ముదిగొండ, ఎర్రుపాలెం, ఖమ్మంరూరల్, కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని 149 ఎంపీటీసీ స్థానాలకు, రెండో విడతలో రఘునాథపాలెం, కొణిజర్ల, సింగరేణి, వైరా, ఏన్కూరు, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని 134 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఇక గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో జరగనున్నాయి. వరుసగా అక్టోబర్ 31, నవంబర్ 4, 8వ తేదీల్లో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు.

–సాక్షి ప్రతినిధి, ఖమ్మం

మొదటి విడత (అక్టోబర్ 23)

జెడ్పీటీసీ స్థానం	ఎంపీటీసీ స్థానాలు
కామేపల్లి	12
బోనకల్	13
చింతకాని	14
మధిర	12
ముదిగొండ	17
ఎర్రుపాలెం	14
ఖమ్మంరూరల్	14
కూసుమంచి	17
నేలకొండపల్లి	18
తిరుమలాయపాలెం	18
మొత్తం	149

రెండో విడత (అక్టోబర్ 27)

రఘునాథపాలెం	13
కొణిజర్ల	15
సింగరేణి	16
వైరా	10
ఏన్కూరు	10
కల్లూరు	13
తల్లాడ	16
పెనుబల్లి	15
సత్తుపల్లి	13
వేంసూరు	13
మొత్తం	134

గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఎన్నికల వివరాలు..

మొదటి విడత (అక్టోబర్ 31)

మండలం	జీపీలు	వార్డులు
కూసుమంచి	41	364
తిరుమలాయపాలెం	40	356
ఖమ్మంరూరల్	21	202
ముదిగొండ	25	246
నేలకొండపల్లి	32	300
కామేపల్లి	24	218
మొత్తం	183	1,686

రెండో విడత (నవంబర్ 04)

మండలం	జీపీలు	వార్డులు
ఏన్కూరు	25	216
తల్లాడ	27	252
కల్లూరు	23	214
పెనుబల్లి	33	298
సత్తుపల్లి	21	208
వేంసూరు	26	244
సింగరేణి	41	356
మొత్తం	196	1788

మూడో విడత (నవంబర్ 08)

రఘునాథపాలెం	37	308
కొణిజర్ల	27	254
వైరా	22	200
ఎర్రుపాలెం	31	284
మధిర	27	236
బోనకల్	22	210
చింతకాని	26	248
మొత్తం	192	1740

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై దరఖాస్తుల పరిష్కారంపై సూచనలు చేశారు.

సోలార్ విద్యుత్‌తో ప్రయోజకరం

ఖమ్మంవ్యవసాయం: సోలార్ విద్యుత్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నందున అర్హత కలిగిన గృహ వినియోగదారులు ఏర్పాటుచేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి సోమవారం ఆయన అధికారులతో 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన'పై సమీక్షించారు. తొలుత పథకం విధివిధానాలను ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారి వెల్లడించాక కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువ మంది సోలర్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుచేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. పూర్తిసమాచారం కోసం ఎన్పీడీసీఎల్ హెల్ప్‌లైన్ 1912 లేదా ఏఈ / డీఈ కార్యాలయాల్లో సంప్రదించేలా ప్రచారం చేయాలని సూచించారు. ఈసమావేశాల్లో డీఆర్వో పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ వద్ద పూజలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం

ఖమ్మంమయూరిసెంటర్: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపంగా బతుకమ్మ పండుగ నిలుస్తోందని.. ప్రకృతిని అమ్మగా కొలిచే ఈ పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం పెవిలియన్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ దంపతులు పాల్గొన్నారు. గౌరమ్మ తల్లికి పసుపు, కుంకుమతో పూజించిన వారు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి ఉత్తేజపరిచారు. డీఆర్డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు, మహిళా ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'చాంబర్' ఎన్నికలకు సమాయత్తం


ఎన్నికల ప్రచారం చేస్తున్న అభ్యర్థులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. ఆఫీస్ బేరర్లు, 19 వ్యాపార శాఖల విభాగాల ప్రతినిధులను మూడేళ్లకోసారి ఎన్నుకుంటారు. ఈమేరకు వ్యాపారులు ప్యానెళ్లుగా ఏర్పడి బరిలో నిలుస్తారు. ఈసారి అధ్యక్షుడిగా కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గొడవర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కురువెళ్ల కాంతారావు, సహాయ కార్యదర్శిగా బాదె రమేష్, కోశాధికారిగా తూములూరి లక్ష్మీనరసింహారావు పోటీ చేసేలా మరికొందరితో ప్యానల్ ఏర్పాటైంది. ఈ ప్యానల్ బాధ్యులు సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులను కలిసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. వీరికి మద్దతుగా పత్తిపాక రమేష్, పాలవరపు కోటేశ్వరరావు, మాటేటి రాకేష్, చిలకల ఆదినారాయణ, వద్దే వెంకటేశ్వర్లు, సోమవరపు సుధీర్‌కుమార్, ప్రభాకర్, బజ్జూరి రమణా రెడ్డి, బండి సతీష్ సిరికొండ వెంకటేశ్వర్లు, గుడిపూడి నరసింహారావు ప్రచారంలో పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు


క్యూలో చెప్పులు పెట్టి వేచి ఉన్న రైతులు

కల్లూరురూరల్: మండలంలోని పోచవరం ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. అయితే, సొసైటీకి 330 బస్తాల యూరియా రాగా, పెద్దకోరుకొండి, పోచవరం గ్రామాలకు 200 బస్తాలు కేటాయించారు. సోమవారం యూరియా పంపిణీ చేస్తారనే సమాచారంతో కూపన్లు తీసుకున్న రైతులు తెల్లవారుజామున 4గంటలకే చేరుకుని చెప్పులు క్యూలో పెట్టారు. కాగా, మిగిలిన 130 బస్తాలను తాల్లూరు వెంకటాపురం రైతులకు అందచేస్తామని ఉద్యోగులు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికులకు అందని లాభాల వాటా

సింగరేణి యాజమాన్యం తీరుతో ఆందోళన

సింగరేణి (కొత్తగూడెం): లాభాల వాటా నగదును పర్మనెంట్ కార్మికులకు అందించిన సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు అందించలేదు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లాభాల వాటాలో కాంట్రాక్ట్ కార్మికులు ఒక్కొక్కరికి రూ.5,500 ఇస్తామని సంస్థ ప్రకటించిన విషయం విదితమే. కాంట్రాక్టర్లు, సింగరేణి యాజమాన్య వైఖరితో లాభాల వాటా చెల్లింపుల వ్యవహారం సందిగ్ధంలో పడింది. గతేడాది ఒక్కొక్కరికి రూ.5 వేలు చెల్లించారు. ఇందుకు సంబంధించిన జీఎస్టీ, ఇన్‌కమ్ టాక్స్ చెల్లించలేదు. దీంతో ఆ భారం సుమారు రూ.16 లక్షలు కాంట్రాక్టర్లే భరించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది లాభాల వాటా నగదు చెల్లించేందుకు కాంట్రాక్టర్లు జాప్యం చేస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న సుమారు 1,213 మంది కాంట్రాక్టర్లు సోమవారం కాంట్రాక్ట్ కార్మికుల ఖాతాల్లో నగదు జమ చేయలేదు. ఏడాది నుంచి సమస్య పరిష్కరించకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రెండు శాతం ఇన్‌కమ్ టాక్స్, జీఎస్టీని కాంట్రాక్టర్లకు నెలవారీ లేబర్ బిల్లులతోపాటు కలిపి చెల్లించే అవకాశం ఉన్నా యాజమాన్యం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. దీంతో సంస్థవ్యాప్తంగా 32 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు లాభాల వాటా నగదు అందక నిరాశకు గురయ్యారు. కాగా, కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా చెల్లింపులో కొర్రీలు పెట్టడం సరికాదని ఇఫ్టూ రీజియన్ కార్యదర్శి ఎన్.సంజీవ్ పేర్కొన్నారు. పండుగ వేళ కార్మికులు పస్తులు ఉండకుండా వెంటనే చెల్లించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

కొదుమూరులో ఉద్రిక్తత

సీపీఐ, బీఆర్ఎస్ వర్గీయుల ఘర్షణ.. పోలీసుల లాఠీచార్జ్

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామంలో సీపీఐ, బీఆర్ఎస్ వర్గీయుల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామంలో బతుకమ్మ ఊరేగింపు ముందుకు సాగే క్రమాన ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. దీంతో ఎస్సై వీరేందర్, సిబ్బందితో చేరుకుని సర్దిచెప్పినా పరిస్థితి సద్దుమణగలేదు. చివరకు లాఠీచార్జ్‌తో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈక్రమాన ఇరువర్గాల అరుపులు, కేకలతో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

చెల్లని చెక్కు కేసులో ఇద్దరికి ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం కవిరాజ్‌నగర్ ప్రాంతానికి చెందిన సీహెచ్.సురేష్‌బాబు, వడిగాశిల్ప శశికళారాణికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బి.రజని సోమవారం తీర్పుచెప్పారు. ఖమ్మం నెహ్రూనగర్‌కు చెందిన జె.రామ జగ్గారావు వద్ద సురేష్, శశికళారాణి 2020 ఫిబ్రవరిలో రూ.6 లక్షల అప్పు తీసుకున్నారు. తిరిగి 2021 ఫిబ్రవరిలో రూ.6 లక్షలకు చెక్కు ఇచ్చినా వారి ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో జగ్గారావు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఈమేరకు ఇద్దరికి జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.6లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మహిళల జీవితాల్లో ముందడుగు

- త్వరలోనే ఇందిరా డెయిరీ ఫలాలు
- వాటాదారులుగా 21వేల మందికి సభ్యత్వం
- మధిర నియోజకవర్గంలో 250 గేదెల కొనుగోళ్లు పూర్తి


బోనకల్‌లో ఏర్పాటుచేసిన బల్క్ మిల్క్ యూనిట్


లబ్ధిదారులకు అందజేసిన గేదెలు

బోనకల్: బోనకల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఇందిరా డెయిరీతో మహిళల జీవితాల్లో ఆర్థిక స్వావలంబన సాధ్యం కానుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో ఇక్కడ డెయిరీ ఏర్పాటుకు అడుగులు చకచకా సాగుతున్నాయి. మధిర నియోజకవర్గంలో మహిళా సంఘాల సభ్యులు 61 వేల మంది ఉండగా, ఇప్పటికే 21 వేల మంది రూ.2,100 చొప్పున చెల్లించి వాటాదారులుగా చేరారు. ఇందిరా డెయిరీ కింద మొదటి విడతలో 125 మందికి రెండు చొప్పున 250 పాడిగేదెలు కొనుగోళ్లు చేశారు. ఇందులో ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.1.60 లక్షలు ఇస్తుండగా, లబ్ధిదారులు రూ.40 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే పలువురు లబ్ధిదారులకు గేదేలు అందించిన నేపథ్యాన లీటర్ పాలను రూ.80 నుంచి రూ.84 వరకు కొనుగోలు చేసి, పాల నిల్వకు శీతలీకరణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు.

భూమి కేటాయింపు

బోనకల్‌లో ఇందిరా డెయిరీ ఏర్పాటుకు 2007లో డిప్యూటీ స్పీకర్ హోదాలో భటి విక్రమార్క తొమ్మిది ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అప్పట్లో శంకుస్థాపన కూడా జరిగింది. దీనికి తోడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఈ పనులన్నీ పూర్తికావడం, లబ్ధిదారులకు దశల వారీగా గేదెలు పంపిణీ చేస్తుండడంతో త్వరలోనే పాల సేకరణ మొదలుకానుంది. తద్వారా మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతమవుతారని చెబుతున్నారు.

ఆర్థిక అభివృద్ధికి భరోసా



ఇందిరా డెయిరీ ద్వారా కొనుగోలు చేసిన పాడి గేదేలతో ఆర్థిక అభివృద్ధికి భరోసా లభిస్తుంది. పాల ఉత్పత్తులకు గిరాకీ ఉండటంతో మాకు ఉపయోగంగా ఉంటుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో ఏర్పాటవుతున్న డెయిరీ వల్ల మాలాంటి వారికి లబ్ధి జరుగుతుంది.

– కొమ్ము జయమ్మ, ముష్టికుంట్ల

మహిళలను శ్రీమంతులుగా చేయడమే లక్ష్యం



వాటాదారులైన మహిళలను శ్రీమంతులుగా చేయడమే డెయిరీ లక్ష్యం. వాటాదారులకు రెండేసి గేదెలు ఇచ్చి మద్దతు ధరతో పాలు సేకరిస్తాం. ఎర్రుపాలెం మండలంలో ఇప్పటికే పాల ఉత్పత్తులను కొనుగోలు చేస్తుండగా, మిగతా మండలాల్లో కూడా త్వరలోనే మొదలవుతుంది.

– కొట్టెం వెంకటేశ్వర్లు, ఏపీఎం, బోనకల్